Namasthe Telangana DT- 08/08/16.



# చేద్దామా..సైకిల్ సవారీ

## ఐటీ కారిడార్‌లో బైస్కిల్ షేరింగ్ పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు

నగర ప్రయాణం సులువు కానుంది. నిత్యం వాహనాల రద్దీతో కనిపించే రోడ్లపై వాహనాలు తగ్గించేందుకు, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు కార్ ఫ్రీ థర్స్‌డే చేపట్టిన నగరం మరో అడుగు ముందుకేయనుంది. సైకిల్ షేరింగ్‌తో సైకిల్ వినియోగాన్ని పెంచే దిశలో జీహెచ్ఎంసీ యోచిస్తోంది.

– సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

నగర జనాభాతో పాటే..వ్యక్తిగత వాహనాల వినియోగం పెరుగుతోంది. నగరంలో పెరుగుతున్న రద్దీకి, కాలుష్యానికి వ్యక్తిగత వాహనాల వినియోగం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. బస్సులు, రైళ్లు, షేరింగ్ ఆటోల కంటే కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఎంఎంటీఎస్, ఫ్లై ఓవర్ల నిర్మాణం సైతం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించలేకపోతోంది. ఫలితంగా నగరంలో గత ఏడాది కార్ ఫ్రీ థర్స్‌డేని ప్రవేశపెట్టారు. కార్ ఫ్రీ థర్స్‌డే ప్రవేశ పెట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మరో కొత్త ప్రతిపాదనతో ముందుకు వస్తోంది ప్రభుత్వం. అదే.. బైస్కిల్ షేరింగ్.

### ఐటీ కారిడార్

నగరంలో ట్రాఫిక్ రద్దీని, కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో గతేడాది హైటెక్ సిటీ ప్రాంతంలో కార్ ఫ్రీ థర్స్‌డేని ప్రవేశపెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అమలవుతున్న కార్ పూలింగ్ వంటి పద్ధతులు మంచి ఫలితాలిస్తుండడమే అందుకు స్ఫూర్తి. కార్ ఫ్రీ థర్స్‌డే ఈ ఏడాది కాలంలో మంచి ఫలితాలిచ్చింది. నగరంలో ప్రతి గురువారం వ్యక్తిగత కార్ల వినియోగం తగ్గడంతో పాటు సైకిల్, ఎంఎంటీఎస్ వంటి ప్రజా రవాణా వ్యవస్థల వినియోగం పెరిగింది. నగరంతో పాటు గుర్‌గావ్, కర్నల్ వంటి నగరాలు సైతం ఇలాంటి ప్రయోగాలు చేస్తుండడం గమనార్హం. ఢిల్లీ ప్రభుత్వం సరి, బేసి సంఖ్య గల వాహనాల కోసం ప్రత్యేక రోజులను నిర్దేశించింది. ప్రజల్లో కాలుష్య రహిత రవాణా వ్యవస్థపై అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పద్ధతి మంచి ఫలితాలిస్తుండడంతో నగరంలో బైస్కిల్ షేరింగ్ ను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.



### బైస్కిల్ షేరింగ్

నగరంలో 40వేల మందికి పైగా వ్యక్తిగత కార్లను వినియోగిస్తున్నారు. 1,10వేల మందికి పైగా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. కార్ల వినియోగాన్ని 10, 15వేలకు తగ్గించే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన కార్ ఫ్రీ థర్స్‌డే మంచి ఫలితాలు సాధిస్తోంది. ఆ స్ఫూర్తితో నగరంలో



బైస్కిల్ షేరింగ్‌ను ప్రారంభించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 500కు పైగా నగరాల్లో ఇప్పటికే ఇలాంటి పద్ధతి అమలులో ఉంది. త్వరలో పైలట్ ప్రాజెక్టుగా నగరంలో 10 బైస్కిల్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవలే నగర మేయర్ ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ దగ్గరిలోని స్టేషన్ నుంచి సైకిల్ రెంట్‌కి తీసుకొని అక్కడి నుంచి ఆఫీసుకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా ఈ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. అనుకూలమైన చార్జీలతో ఏర్పాటు చేసే ఈ స్టేషన్‌ల వల్ల నగరంలో కాలుష్యం తగ్గడంతో పాటు, ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ముందుగా ఈ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు.

# సైకిల్‌తో కాలుష్యం, ట్రాఫిక్‌కు చెక్

## 300 బైస్కిల్ స్టేషన్లు : ఎన్‌వీఎస్ రెడ్డి



జెండా ఊపి రైడను ప్రారంభిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి, సందీప్ సుల్తానియా

కొండాపూర్, ఆగస్టు7: నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ బైస్కిల్ క్లబ్ బైస్కిల్ రైడ్ ద్వారా వినూత్న ఘట్టానికి తెర తీసిందని మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ వద్ద హైదరాబాద్ బైస్కిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చెక్ దే ఇండియా–2 రైడ్' ను రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సందీప్ సుల్తానియాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సైకిళ్ల ద్వారా కాలుష్యంతోపాటు ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుందన్నారు. నగరంలో నూతనంగా ప్రారంభం కానున్న మెట్రో రైలు స్టేషన్లకు అనుసంధానంగా లాస్ట్ మైల్, ఫస్ట్ మైల్‌లను కలుపుతూ నగరంలో 300 బైస్కిల్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బైస్కిల్ స్టేషన్ల నిర్మాణానికి యునైటెడ్ నేషన్స్ హబిటేటెడ్ నుంచి క్లైమెట్ ఛేంజ్ ఫండ్ అందజేస్తున్నట్లు తెలిపారు. రవాణా శాఖ కమిషనర్ సందీప్ సుల్తానియా మాట్లాడుతూ..నగరంలో 2005లో 25 లక్షల వాహనాలు ఉండేవని, కానీ నేడు 80లక్షలకు పైగా రోడ్లపై తిరుగుతున్నాయన్నారు. చక్ దే ఇండియా–2 రైడ్‌ను దశల వారీగా రెండు విభాగాలుగా నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ బైస్కిలింగ్ క్లబ్ చైర్మెన్ డీవీ. మనోహర్, అడిలైడ్ నగర మాజీ మేయర్ స్టీఫెన్ యార్‌వుడ్ పాల్గొన్నారు.

